

వర్కింగ్ జర్నలిస్ట్స్ హెల్త్ స్కీమ్ పొడిగింపు

ప్రజాశక్తి-కాకినాడ

వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమును 2023-24 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రిడిటేషన్ కార్డు పొందిన వర్కింగ్ జర్నలిస్టులు హెల్త్ స్కీమ్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రీమియం మొత్తం రూ.1,250 www.cfms.ap.gov.in వెబ్ సైట్ ద్వారా హెడ్ ఆఫ్ ఎకౌంటు 8342-00-120-01-03-001-001, డిడిఒ కోడ్ 2703-0802-003 పద్దుకు చెల్లించి ఒరిజినల్ చలనా, గతంలో జారీచేసిన హెల్త్ కార్డు జెరాక్స్, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డు జెరాక్సు కాపీలను డిపిఆర్ఒ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కొత్తగా స్కీమ్ లో చేరాలనుకుంటే డిపిఆర్ఒ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఖాతాల్లో చేరని అమ్మఒడి సొమ్ము

బ్యాంకుల చుట్టూ తల్లుల ప్రదక్షిణలు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అర్హత ఉన్నా అనేకమందికి అమ్మఒడి పథకంలో అవకాశం దక్కలేదు. వివిధ నిబంధనలు పేరుతో ప్రభుత్వం పలువురిని పక్కన పెట్టింది. కొంతమందికి అమ్మఒడి అందుతుందని జాబితాలో పేర్లు ఉన్నా ఖాతాల్లో నేటికీ సొమ్ములు జమ కాలేదు. ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి మూడు రోజులు దాటిందని, నేటికీ డబ్బులు పడలేదని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పలువురు తల్లులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఈ ఏడాది 1,86,708 మంది ఖాతాల్లో రూ.280.06 కోట్లు సొమ్ము వేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. అత్యధికంగా కాకినాడ అర్బన్ లో 25,170 మందికి ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున రూ.32.72 కోట్లు, కాకినాడ రూరల్లో 14,309 మందికి రూ.18.60 కోట్లు, తుని మండలంలో 12,156 మంది ఖాతాల్లో రూ.15.80 కోట్లు, సామర్లకోట 12,044 మందికి రూ.15.66 కోట్లు, పెద్దాపురంలో 11,049 మందికి రూ.14.36 కోట్లు, పిఠాపురంలో 10979 మందికి రూ.14.27 కోట్లు, తొండంగి మండలంలో 8940 మందికి రూ.11.62 కోట్లు, తాళ్లరేవు 8260 మందికి రూ.10.74 కోట్లు జమ అయ్యాయని అధికారులు తెలిపారు.

జమ కాని సొమ్ములు

గత నెల 28న ముఖ్యమంత్రి జగన్ అమ్మఒడి సొమ్ములు జమ చేస్తున్నట్లు ప్రకటించారు. మూడు రోజులు దాటినప్పటికీ 90 శాతం మంది ఖాతాలలో నేటికీ సొమ్ములు జమ అవ్వలేదు. గత మూడు రోజులుగా తిరుగుతున్నా, బ్యాంకు సిబ్బంది అడుగుతుంటే ఇంకా జమ కాలేదు. మళ్ళీ రండి అని వెనక్కి పంపుతున్నారని పిఠాపురం మండలం మల్లం యూనియన్ బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న లబ్ధిదారులైన రంగనాథం వీరమణి, వెన్నా దేవి, రంగనాథం ప్రభావతి, కందికొండ అమరావతి తదితరులు తెలిపారు.

నానాటికీ తగ్గుతున్న లబ్ధిదారులు

వివిధ నిబంధనలను విధించిన ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తూ వస్తోంది. ప్రధానంగా విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటకూడదనే నిబంధన వల్ల అనేకమంది అర్హులకు కూడా అమ్మఒడి లబ్ధి చేకూరని పరిస్థితి నెలకొంది. ఈ వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండడంతో పేద, సామాన్య వర్గాలు సైతం పరిమితికి మించి విద్యుత్తు వాడకం చేశారు. గతేడాది 2022-23లో 1,88,157 మంది తల్లుల ఖాతాల్లో రూ.282.23 కోట్లు వేశారు. ఈ ఏడాది 1,449 మందికి రూ.2.17 కోట్లు కోత విధించారు. నాలుగేళ్లుగా పథకం ప్రారంభమైన రోజునే ఖాతాల్లో సొమ్ములు జమ అవుతుండగా ఈ ఏడాది ఇంకా పడకపోవడంతో పలువురు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను అడుగుతుంటే తమకు సమాచారం తెలియదని బదులిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమ్మఒడి డబ్బులు ఎప్పుడు అందుతాయో అని పలువురు ఆందోళన చెందుతున్నారు.

అర్హులకు 100 శాతం సంక్షేమ పథకాలు

ప్రభుత్వ సేవలు నూరు శాతం అందరికీ అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పలువురు అన్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కరప చిరంజీవి కళ్యాణ మండపంలో జగనన్న సురక్ష శిబిరాన్ని రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు. సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. శిబిరానికి హాజరైన స్థానిక ప్రజలతో ముచ్చటించారు. ఆర్డిఒ ఎస్వివి.సత్యనారాయణ, డిఎల్డిఒ పి.నారాయణమూర్తి, జెడ్పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ ఎస్.ఆశాజ్యోతి, తహశీల్దారు పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ కె.అప్పారావు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణంలోని 1, 2 వార్డుల్లో ఆర్డిఒ జె.సీతారామారావు, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, డిప్యూటీ తహశీల్దారు పి.విజయ్ కుమార్, మేనేజర్ యు.జ్యోతిరాణి, చైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి పాల్గొన్నారు. **రౌతులపూడి** శృంగవరంలో 320 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను ప్రతిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ అందజేశారు. ప్రత్యేకాధికారి ఎస్విఎస్.సుబ్బలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, డిసిసిబి డైరెక్టర్ మధు, తహశీల్దారు భీమారావు, ఎంపిడిఒ గోవింద్, సర్పంచ్ ఏసుబాబు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** జిల్లా సహాయ కలెక్టర్ ప్రఖర్ జైన్ చెప్పారు. ఉండూరులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిడిఒ డి శ్రీలలిత, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కష్ణమూర్తి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** పిల్లంక సచివాలయంలో తహశీల్దారుఎ పోతురాజు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్షలో ఎంపిపి రాయుడు సునీత, చింతలపాటి శ్రీనివాసరాజు, జెడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, రాయుడు గంగాధర్, ధూళిపూడి బాబి, ప్రత్యేకాధికారి లక్ష్మీనరసయ్య, పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్** 1 ఎ, 8 ఎ, 15 ఎ, 22 ఎ, 29ఎ, 43ఎ సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రారంభించారు. ఎంఎల్ఎలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, కుడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు పాల్గొన్నారు. **జగ్గంపేట** ఎంఎల్ఎ జ్యోతుల చంటి బాబు సచివాలయం1లో పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వసంత కుమార్, తహశీల్దార్ శ్రీదేవి, బండారు రాజా, డాక్టర్ వొమ్మి రఘురాం, శ్రీనివాస్ పాల్గొన్నారు. **కాజులూరు** అంద్రంగిలో వనుం వెంకట సుబ్బారావు, డిడిఒ అన్నామణి, తహశీల్దారు సాయి సత్యనారాయణ, రత్నం రాజు ఎంపిపి మాత భారతి మురళి, సర్పంచ్ పెద్దిరెడ్డి నాగ సుజాత పాల్గొన్నారు.


కరపలో సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ కన్నబాబు

విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం

పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని శనివారం పట్టణంలోని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎలక్ట్రికల్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుంచే చిన్న, కోనేటి రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తుచ తప్పకుండా పాటిస్తున్న విధానాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. నూతన విద్యుత్తు సవరణ చట్టాన్ని రద్దు చేసి ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై అధికబారాలు మోపుతున్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి మేము అధికారంలోకి వస్తే ఛార్జీల బాదుడు ఉండదని చెప్పిన మాటను వైసిపి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజలపై అదనంగా విద్యుత్ ఛార్జీల రూపంలో అదనపు భారం విధించడం సరికాదన్నారు. 2015లో బకాయిఉన్న విద్యుత్ సంస్థల బాకీలను పూడ్చేందుకు ఇప్పుడు ప్రజలపై అధిక భారాలు వేయడం సమంజసం కాదన్నారు. విద్యుత్తు ఛార్జీలు తగ్గించని పక్షంలో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కె.విశ్వనాథం, జి.వీరబాబు, కె.మణి, సూర్యనారాయణ, రాజేష్ ఎం.అర్జున్ రావు, కొత్తపెల్లి మండల సిఐటియు నాయకులు నాగేశ్వరరావు, కెవివి సత్యనారాయణ, సిహెచ్.సాంబశివ, జి.అప్పారావు, సూర్యప్రకాష్, నాగన్న, సత్తిబాబు, అప్పారావు, ప్రసాద్, మాణిక్యాలరావు, అప్పన్న, డి.శ్రీనివాసు, గుణేశ్వరరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

20 ఏళ్లకు ప్రజలు గుర్తుకొచ్చారా : మంత్రి రాజా

ప్రజాశక్తి-కోటనందూరు

మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకష్ణుడు 20 ఏళ్లుగా తిరగని ప్రతి వీధికీ నేడు తిరుగుతూ ప్రజలకు క్షమాపణ చెబుతున్నారని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం తుని పట్టణం, ఎస్.అన్నవరం, కోటనందూరు మండలం ఇండుగపల్లిలో వైఎస్ఆర్ సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడడంతో యనమల రామకష్ణుడికి గతంలో ఎన్నడూ లేనంత విధంగా నియోజకవర్గ ప్రజలపై అమితమైన ప్రేమ పెరిగిపోయిందన్నారు. గ్రామాల్లో మోకాళ్ళ మీద తిరుగుతున్నారన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రసారం చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రజలకు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నిన్ను నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. చంద్రబాబు పాలనలో వ్యవసాయ రంగం రాష్ట్రంలో 26వ స్థానంలో ఉండేదని జగన్ ప్రభుత్వంలో ఆరో స్థానానికి ఎగబాకిందన్నారు. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొప్పన రాము, వైస్ ఎంపిపి సోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, పోతల రమణ, నాగేంద్ర నెహ్రూ, ఎంపిపి లగుడు శ్రీనివాస్, కుంచే అచ్చిరాజు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకట కష్ణాజీ, లాలం బాబ్జి, గొర్ల రామచంద్రరావు, అచ్చినాయుడు, గంగాధర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భవన కార్మికుల పథకాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, పెండింగ్ క్లెయిములను విడుదల చేయాలని కోరుతూ శనివారం ధర్నా చేశారు. అచ్చంపేటలోని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చింతల సత్యనారాయణ మాట్లాడారు. 2007 నుంచి రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభమైన సంక్షేమ పథకం జగన్ మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నిలిపివేశారని తక్షణమే పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, పెండింగ్ క్లయిములు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం రూ.1200 కోట్లు ఉంటే రూ.2400 కోట్లు ఖర్చు పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఉన్న నిధులను వాడుకున్నదని తక్షణమే ఆ నిధులు జమ చేయాలని, ఢిల్లీ ప్రభుత్వం నిర్మాణ కార్మికులకు ఉచిత బస్, గహ నిర్మాణ రుణం 75 శాతం ఉచితంగా అందిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మోటార్ సైకిళ్లను వాయిదాల పద్ధతిలో అందించినదని చెప్పారు మన రాష్ట్రంలో మాత్రం పథకం నిలిపి వేశారని తక్షణమే ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న సంక్షేమ పథకాలు అందించాలని 50 ఏళ్లు దాటిన వారికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సామర్లకోట మండల ప్రధాన కార్యదర్శి ఎన్.సురేష్, పెద్దాపురం సిఐటియు నాయకులు సిరిపురపు శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సామర్లకోట మండల అధ్యక్షులు ప్రకతి ఈశ్వరరావు, పట్టణ అధ్యక్షులు పెనుపోతుల సత్తిబాబు, పెదబ్రహ్మదేవం అధ్యక్షులు పేపకాయల ప్రసాద్, వేట్లపాలెం నాయకులు కె.రామారావు, ఎస్కె.భాపన్ సాహెబ్, మాధవపట్నం నాయకులు కాళ్ల లోవబాబు, ఎస్కె.ఖాజా, నవర నాయకులు కన్నె వీరబాబు, పెద్దాపురం నాయకులు గడప వీరబాబు, ముమ్మన శ్రీను, పూసల సుబ్బారావు, నీలపాల కష్ణ, పాలపత్రి వీరబాబు, పాండవగిరి పెయింటింగ్ యూనియన్ కరణం అప్పారావు, వడ్డి సత్యనారాయణ, రాచపల్లి చంద్రశేఖర్, యాసలపు మహేష్, ఎలక్ట్రీకల్ యూనియన్ తాడిశెట్టి గంగాధరరావు, ఎస్కె.బాషా పాల్గొన్నారు. **నాయకులు**



ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నేతలు

మత్తు పదార్థాల నిషేధానికి పోరాటం

ప్రజాశక్తి-కాకినాడ

మహిళలు, బాలికపై హింస అరికట్టాలని మద్యం, మత్తు పదార్థాలు, గంజాయిని నిషేధించాలని ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవనంలో ఐక్య వేదిక కన్వీనర్ సిహెచ్.రమణి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మద్యం మత్తు పదార్థాలు గంజాయిలను నిషేధించాలని కార్యాచరణ చేపట్టారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాలో రెండు రోజులు జీపు జాతా నిర్వహించి, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యము తీసుకురావాలని, స్కూల్స్, కాలేజీల్లో సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులలో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. పిల్లలకు, మహిళలకు రక్షణ చర్యలు చేపట్టే వరకు, మద్యం, మత్తు పదార్థాలు, గంజాయిలను అరికట్టేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఐ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, జమాతే జిల్లా ప్రెసిడెంట్ ఇబ్రహీం, అహ్మద్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, శ్రామిక మహిళా సంఘం నాయకులు సిహెచ్.పద్మ, సిద్ధిక, గౌషియా, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి, ఐలు నాయకురాలు కె.నాగజ్యోతి, ఎస్ఎఫ్ఐ నాయకులు సూరిబాబు, దినేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం, ఐద్వా టౌన్ ప్రెసిడెంట్ జి.భూలక్ష్మి, బి.గంగాభవాని, పద్మావతి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమణి

టిడిపి మినీ మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గత మే నెలలో మహానాడు వేదికపై తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో అధికార వైసిపి ప్రభుత్వంలో వణుకు పుట్టిందని టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. శనివారం కాకినాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి హయాంలోని ఎన్నో ప్రాజెక్టులు పూర్తి దశలోను, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని వాటిని వైసిపి ప్రభుత్వం ముందుకు తీసుకు వెళ్లలేదన్నారు. వీటిపై ఆదివారం జగ్గంపేట నుంచి బస్సు యాత్రను ప్రారంభిస్తున్నట్లు జ్యోతుల తెలిపారు. రాష్ట్రాన్ని రూ.తొమ్మిది లక్షల అప్పుల ఊబిలో కూరుకుపోయే వైసిపి చేసిందన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అభివద్ధి చేస్తూ, సంక్షేమం నిర్వహిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపజేశారని చెప్పారు. నవరత్నాలు పేరుతో ప్రభుత్వం 99 పైగా హామీల అమలు చేసావని చెప్పారని ఎన్నో అబద్ధాలు, మాయ మాటలతో అధికారంలోకి వైసిపి ప్రభుత్వం వచ్చిందన్నారు. వారి అసత్యాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ నాయకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల రాజశేఖర్, పెంకే శ్రీనివాస్ బాబా, తూము కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఎస్‌పి పరామర్శ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ చాతి నొప్పితో అస్వస్థకు గురై కాకినాడ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జె.శంకరరావును ఎస్పీ సతీష్ కుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

టిడిపి బస్సు యాత్రపై నేడు సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి మీ భవిష్యత్తుకు మా గ్యారెంటీ చైతన్య యాత్ర నిర్వహణపై ఈ నెల 2న దివిలి గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ మేనిఫెస్టోపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 5 నుంచి పెద్దాపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పిలుపు ఇచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి మీ భవిష్యత్తు మా గ్యారెంటీ బస్సు యాత్ర 7వ తేదీన కాకినాడకు చేరుకుంటుందన్నారు. మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, తాజుద్దీన్, చింతా పేర్రాజు, ఒమ్మి బాలాజీ, గుజ్జు బాబు, ఖాన్, బంగారు సత్యనారాయణ, రహీమ్, సీకోటి అప్పలకొండ, సయ్యద్, గాది శివ, చింతలపూడి రవి, మూర్తి, ఎం.సునీత, పాల్గొన్నారు.

రక్తదాత బాబికి ఘన సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పలుమార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన పి.మల్లవరం పంచాయతీకి చెందిన ధూళిపూడి వెంకటరమణ (బాబీ)ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ టీమ్ అధ్యక్షుడు డాక్టర్ పవన్ కుమార్ శనివారం ఘనంగా సత్కరించారు. నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా కాకినాడ రోటరీ క్లబ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బాబీని సత్కరించారు. ఈ సందర్భంగా 79వసారి రక్తదానం చేసినట్లు బాబీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ కార్యదర్శి హెచ్.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



జీతం లేదురా... మొత్తం చెత్తపన్ను కింద రికవరీ చేశారు..!!

విద్యా విధానంలో ఉన్నతమైన సంస్కరణలు

ప్రజాశక్తి - కాకినాడ

విద్యా విధానంలో ఉన్నతమైన సంస్కరణలు అవసరమని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.జగదీష్ కుమార్ అన్నారు. జెఎన్టియుకెలో ఉన్నత విద్యాప్రణాళికా బోర్డు 5వ సమావేశం శనివారం అలూమ్ని ఆడిటోరియంలో ప్రారంభమైంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జగదీష్‌కుమార్ మాట్లాడారు. విద్యా విధానంలో ఉన్నతమైన సంస్కరణలు, బోధనాపరమైన మార్పులు చేపట్టేందుకు, విద్యలో పెరుగుతున్న అసమానతలను తగ్గించేలా పెద్ద లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని విసిలకు సూచించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని దృష్టిలో పెట్టుకుని మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన చెప్పారు. ఆధునిక విద్యా విధానాలను ఎప్పటికప్పుడు అమలు చేయాలని ఆయన అధ్యాపకులకు సూచించారు. న్యాక్, ఎన్‌డిఎ తదితర గుర్తింపు సంస్థలను ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో వై.నజీర్ అహ్మద్, కె.శ్యామలరావు, పోలా భాస్కర్, కె.రామ్మోహనరావు, పి.ఉమా మహేశ్వరి దేవి, జెఎన్టియుకె విసి జివిఆర్.ప్రసాదరాజు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కాజులూరు

అందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ వెల్లడించారు. శనివారం ఆయన దుగ్గుదుర్రులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వనుం వెంకట సుబ్బారావు, ఎంపిపి ఎం.భారతిమురళి, తహశీల్దారు సాయి సత్యనారాయణ, ఎంపిడిఒ రతన్‌రాజు, గుబ్బల యేసు రాజు, కట్టా అప్పారావు, పోతు శ్రీనివాస్, యాళ్ల సత్తిబాబు పాల్గొన్నారు.

వైద్య సేవలను మరింత విస్తరించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాముఖ్యతనిస్తూ అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి, కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే దిశగా క్షేత్రస్థాయి వైద్య అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ గ్రామీణ మండలం, పండూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ కృతికా శుక్లా.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పిహెచ్‌సి ప్రాంగణంలో నూతనంగా మంజూరైన బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో శస్త్రచికిత్స, బాలింతలు, డ్రగ్ స్టోరేజ్ తదితర వార్డులను, తనిఖీ చేసి వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరు వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, డిఐఒ డాక్టర్ ఐ.ప్రభాకర్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ కె.విజయ భాస్కర రెడ్డి, డాక్టర్ అయిషా ఫాతిమా పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కోటనందూరు

భవన కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా హామీ ఇచ్చారు. శనివారం సిఐటియు తుని కోటనందూరు మండల కార్యదర్శులు ఎస్కె.పద్మ, నకిల్ల శ్రీనివాస్, వై.ధనలక్ష్మి భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో మంత్రి దాడిశెట్టి రాజాకు తుని పట్టణంలో ఉన్న కార్యాలయంలో కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పద్మ మాట్లాడుతూ మూత వేసిన భవన కార్మికులు, ఇతర కన్స్ట్రక్షన్‌లో సంక్షేమ బోర్డులను పున్నప్రారంభించాలని కోరారు. 1214 జిఒను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, సిఎం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

వల్లభస్వామికి రూ.2.19 లక్షల ఆదాయం

ప్రజాశక్తి- పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,19,160, అన్నదాన విరాళాల ద్వారా రూ.55,576, కేశఖండన ద్వారా రూ.10,400 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, మజ్జిగ పంపిణీ, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, కృష్ణ, సత్యనారాయణ, సహకారం అందించారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో నూతనంగా ఎంపికైన పారా లీగల్ వాలంటీర్లకు రెండు రోజులపాటు చట్టాలపై నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. సీనియర్ సివిల్ జడ్జి ఎన్.సరస్వతి ప్రారంభించి ప్రసంగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన న్యాయవాదులు మడికి రాంబాబు, అత్తిలి ప్రభూజి, బి.విజయలక్ష్మి, ఆర్ కామేశ్వరరావు, పి.చిన్న చంటి, ఎస్.విశాలాక్షి చట్టాలు, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. అప్పలకొండ పాల్గొన్నారు.

ఆదిత్య ప్రొఫెసర్ భార్గవికి డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.నాగ భార్గవి జెఎన్టియుకె నుంచి డాక్టరేట్ పొందినట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. డాక్టర్ జి.జయ సుమ నేతత్వంలో కె.నాగ భార్గవి సమర్పించిన థీసిస్‌కు ఈ డాక్టరేట్ పొందారని తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, పి.వేణు గోపాల్ అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి సెంటర్ జాతీయ రహదారిపై రావులపాలెం వైపు వస్తున్న లారీ డివైడర్ దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో సంఘటనా స్థలంలోనే మరణించారు. పాలకోడేరు మండలం వేండ్ర గ్రామానికి చెందిన పాల నరసింహమూర్తి (65) గ్రామంలో ఉన్న కూతురును చూడటానికి వచ్చాడు. జాతీయ రహదారి డివైడర్ దాటి వెళుతుండగా లారీ ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వికెరాయపురం- మాధవపట్నం కెనాల్ రోడ్డులో శనివారం గుర్తు తెలియని సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని వివరాలు తెలిసినవారు సిఐ కె.దుర్గాప్రసాద్ 940796568, 9701626505 నెంబర్లలో సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

యువతి అదృశ్యం పై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

యువతి అదృశ్యంపై సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు వారి వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు బంధువుల ఇంటిదగ్గర వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శనివారం యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

భేటీ బచావోపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

నవర జెడ్‌పి ఉన్నత పాఠశాలలో వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.ప్రశాంత్ అధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావోపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం-1994, బేటీ బబావో, బేటీ పడావో నినాదంతో 8, 9, 10వ తరగతి బాలికలకు వివరించారు. బాలికల ఆరోగ్యం, పోషణ, బాల్య వివాహాల నివారణ, బాల్య వయస్సులో అబార్షన్లు, బాలికల చదువు, అభివృద్ధి, సామాజిక భద్రత, రక్షణ, మొదలయిన అంశాలపై అవగాహన, సమాజంలో ఆడవాళ్లు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సబ్ సెంటర్ల వద్ద, అంగన్‌వాడీ సెంటర్లలో మహిళలు, యుక్త వయస్సు అమ్మాయిలను సమావేశపరచి వారికి మహిళా సాధికారత, మహిళా ఆరోగ్యం, పోషణ, రక్షణ, సామాజిక భద్రత, వివాహ వయస్సు, కుటుంబ సంక్షేమం దిశ చట్టం మొదలయిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కష్ణారావు, ఎంఎల్‌హెచ్‌పి శిరీష, ఎఎన్ఎం వీరమణి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగిలోని తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరినట్లు స్థానిక వైసిపి నాయకులు బూరెల వెంకటరాజు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పలువురికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పులప కూర చిన్నబాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 20 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో శివాజీ గణేష్, ఉప సర్పంచ్ స్వర్ణ రాజు, గోవిందు, కాపవరపు శ్రీదేవి, వారా సూర్యకుమారి, మాస శ్రీనివాస్, నూకరాజు, దిమ్మల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు తాటాకిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఎ.వేమవరం పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలోఏడు తాటాకిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ముందుగా ఒక ఇల్లు అంటుకోవడంతో చుట్టుపక్కల ఇళ్ళకు మంటలు వ్యాపించాయి. అగ్ని మాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసేంది. అగ్ని ప్రమాదానికి సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పెట్రోల్ బంక్ లోకి మంటలు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకున్నారు. ప్రమాదానికి కారణం మానవ తప్పిదమే అని స్థానికులుచెబుతున్నారు. ఈ ప్రమాదంలో కమ్మసత్తి నాగరాజు, కమ్మసత్తి దుర్గ ప్రసాద్, నల్లపా గోగులు, కమ్మసత్తి ఏడుకొండలు, కమ్మసత్తి చిన్న కి చెందిన 5 ఇళ్లు అగ్నికి ఆహుతి అవ్వగా కట్టు బట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో మరో రెండు ఇళ్ళు పాక్షికంగా మంటల్లో చిక్కుకొనగా అప్పటికే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

నిత్యావసరాల అందజేత

రెడ్ క్రాస్ సభ్యులు లింగోలు పండు, తాతాజి లు రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణకు ఈ ఘటనను తెలియజేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు ఈ ఘటనను కలెక్టర్‌కు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకి 20 కేజీలు డ్రై రేషన్ కిట్టు , ఒక టార్పాలిన్ , ఒక వంటసామాగ్రి కిట్టు (32 వస్తువులు), ఒక శానిటేషన్ కిట్టు లను మంత్రి పినిపే విశ్వరూప్ చేతులమీదగా ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పిన్నమరాజు శ్రీనివాస రాజు, సెక్రటరీ డా.పియస్ శర్మ, జాయింట్ సెక్రటరీ యమ కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు

గోకవరం : మండలంలోని కామరాజుపేట శ్మశాన వాటికలో మండల పరిషత్ నిధులతో శ్మశానంలో చేపట్టిన అభివృద్ధి పనులకు శనివారం గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ, సర్పంచ్ అడపా వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కామరాజుపేట కాపుల వీధిలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, శ్మశానంలో వాటర్ ట్యాంక్ పనులు చేపట్టామన్నారు. రాజమండ్రపు సుబ్బారావు, గుల్లంపూడి నాగేశ్వరరావు శ్మశాన వాటిక సమస్యను ఎంపిపి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఎంపిపి స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఎంపిపికి, జడ్‌పిటిసికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మజ్జురి అప్పారావు, సింబోతుల అచ్చిరాజు, నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్, తదితరులు పాల్గొన్నారు,.

రాలని చినుకు.. కరెంటు షాకు..



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తొలకరి చినుకులు రాకపోవడంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. ఏరువాక పౌర్ణమి అనంతరం వర్షాలు పడడం ప్రతి సంవత్సరం పరిపాటి. ఈ ఏడాది జులై వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ఖరీఫ్‌కు ప్రణాళికలు సిద్ధం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే జూన్ 1 నుంచి కాలువలకు నీరు విడుదల చేశారు. రైతుల అవసరాలకు తగ్గట్టుగా ఎరువులు అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు రైతు భరోసా పథకం ద్వారా రైతులకు నగదు అందజేసింది. ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించడంలోనూ, బ్యాంకు రుణాలు అందించడంలోనూ కౌలు రైతులకు ప్రభుత్వం ఈ ఏడాది కూడా నిర్లక్ష్యం వెంటాడింది. గోదావరి ఆయకట్టులో నీటి లభ్యత ఉండటంతో అక్కడక్కడ సాగు మొదలైంది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. దీనిలో 65 వేలకు పైగా ఎకరాలు మెట్ట భూముల్లో సాగుతోంది. అత్యధిక మంది రైతులు ఇప్పటికే నార్లు వేయలేదు. మరోవైపు విద్యుత్ శాఖ అధికారులను నిర్లక్ష్యం వెంటాడుతోంది. నీటి లభ్యతను బట్టి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా సాగునీటి బోర్లకు 5 హెచ్‌పి 10 హెచ్‌పి మోటార్ల ఏర్పాటు చేసుకుని రైతులు జలవనరులను సద్వినియోగం చేసుకుంటారు. వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సకాలంలో మంజూరు చేయడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఉన్నతాధికారులు దష్టి సారించి త్వరితగతిన కలెక్షన్లను మంజూరు చేయాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు.

అమ్మ ఒడి నగదు కోసం ఎదురుచూపులు

అమ్మ ఒడి పథకం నగదు కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి పథకం పేరుతో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేల చొప్పున జమ చేస్తున్నామంటూ అట్టహాసంగా ప్రారంభించింది. జులై ఒకటో తేదీ వచ్చిన జిల్లాలో అనేకమందికి ఇప్పటికీ నగదు జమ కాలేదు. దీంతో సమీపంలోని సచివాలయాలకు క్యూ కడుతున్నారు. అక్కడ వెల్ఫేర్ అసిస్టెంట్లను కలిసి స్టేటస్ అడిగి తెలుసుకుంటున్నారు. అక్కడి సిబ్బంది ఇచ్చే సమాధానం విని నిరాశతో వెనుదిరుగుతున్నారు. సాంకేతిక కారణాలు సైతం లబ్ధిదారులకు అర్హతను దూరం చేశాయి.

విద్యుత్ ఛార్జీలపై సర్వత్రా ఆందోళన

విద్యుత్ ఛార్జీల పెంపు వినియోగదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. యూనిట్‌కు ఏకంగా 80 పైసలు చొప్పున పెంచడంతో అధికంగా కరెంట్ బిల్లులు వస్తున్నాయి. రాబోయే నాలుగేళ్ల పాటు ఈ విధంగానే వసూలు చేస్తామని ప్రకటించడం కలవరానికి గురి చేస్తోంది. పల్లెల నుంచి పట్టణాలకు ఉపాధి కోసం వచ్చే మధ్య తరగతి, దిగువ తరగతి ప్రజలు అద్దె ఇళ్లల్లో ఉండడం పరిపాటి. ఐదేళ్ల క్రితం వినియోగించిన కరెంటుకు తాజాగా అద్దెకున్న వారిపై విధించడం విమర్శలకు దారి తీస్తోంది. గతంలో ఎవరో వినియోగించిన విద్యుత్‌కు తాము ఎలా చెల్లిస్తామని ఇంటి యజమానులను ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు యజమానుల వద్ద కూడా సమాధానం లభించడం లేదు. మరోవైపు చిరు పరిశ్రమలకు సైతం ఈ నిర్ణయం శరాఘాతంగా మారింది. కుటీర పరిశ్రమలకు కొన్ని సంవత్సరాలుగా ప్రోత్సాహం లేకపోవడంతో కునారిల్లుతున్నాయి. కొన్ని మూతపడగా మరికొన్ని ఆర్థికంగా ఇబ్బందులు ఉంటున్నాయని యజమానులు చెప్తున్నారు. జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత ఆక్వా రంగం, పౌల్ట్రీ పరిశ్రమ తర్వాత స్థానంలో ఉన్నాయి. ఆక్వా రంగానికి రాయితీలు కల్పిస్తున్నప్పటికీ వివిధ కారణాల పేరుతో అర్హులకు సైతం ప్రభుత్వం కోత విధిస్తున్నది. పౌల్ట్రీ రంగానికి రాయితీలు లేకపోవడంతో ఇప్పటికే ఆర్థికంగా ఆ రంగం కుదేలైంది. తాజా నిర్ణయం గోరుచుట్టుపై రోకలి పోటులా మారిందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళనలు

విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు అవుతున్నారు. చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం గతంలో విద్యుత్ సంస్కరణలు అమలు చేసిన విషయం విదితమే. ఆనాటి పోరాటాల ఫలితంగా చంద్రబాబు 9 ఏళ్ల అధికారానికి దూరమయ్యారు. అభివృద్ధి సంక్షేమం అంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సైతం కేంద్రంలోని బిజెపి విధానాలని ఏకపక్షంగా రాష్ట్రంలో అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. దీనిలో భాగంగానే విద్యుత్ ఛార్జీల పెంపు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమాలు హోరెత్తుతున్నాయి. ఈ పోరాటంలో ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, వివిధ పార్టీల మద్దతును కూడగడుతున్నాయి. ప్రజలకు మేమున్నామంటూ భరోసా ఇస్తున్నా యి.

యానాం వార్తలు


డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైద్యులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - యానాం

జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్లను శనివారం ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ మనిషికి ప్రాణం పోసేది దేవుడైతే.. ఆ మనిషి ప్రాణాన్ని కాపాడేది డాక్టర్ అని అన్నారు. సమాజంలో డాక్టర్ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దంగుడుబియ్యం సత్యనారాయణ, రాజాబాబు, సతీష్ చంద్ర, చెక్కల అరుణ్ కుమార్, నిరంజన్, రామకృష్ణ, రాజాబాబు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని మున్సిపాలిటీ, ప్రజా పనుల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం సిఎస్ఆర్ నిధులు సుమారు రూ.కోటీ 49 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో కామరాజ్ నగర్, జిఎన్ నాయుడు కాలనీ, మెట్టకూరు రాజరాజేశ్వరి నగర్, బెజవాడ గార్డెన్స్, నవాజ్ గార్డెన్స్ లేఔట్, దోబీ స్ట్రీట్, త్యాగరాయ వీధి, చిల్డ్రన్స్ పార్క్, పెదపూడి స్ట్రీట్ తదితర గ్రామాల్లో డ్రైనేజీలు, సిసి రోడ్లు, బిటి రోడ్లు వెయ్యనున్నట్లు తెలిపారు.

ఆలయ సముదాయ కమిటీ రద్దు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో ఉన్న పలు ఆలయాల కమిటీలతో పాటు యానాంలో శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయ కమిటీని రద్దు చేస్తూ మద్రాస్ హైకోర్టు తీర్పునిచ్చిందని స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ తెలిపారు. కమిటీ నియామకం నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని మద్రాస్ హైకోర్టులో ఎంఎల్ఎ అశోక్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. రద్దయిన దేవస్థానం కమిటీ నుంచి వెంకటేశ్వర స్వామి వారి నగలు, భూములు, ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని శనివారం స్థానిక చల్లావారి కళ్యాణ మండపంలో అధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ప్రముఖ డాక్టర్ డాక్టర్ ఐవి.రావు, డాక్టర్ సిసిఎస్ శర్మ, డాక్టర్ వాద్రేవు రవి, డాక్టర్ యమ్.బి.ఆర్ శర్మ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐవి రావు మాట్లాడుతూ, వైద్యులు సమాజంలో తమ వత్తి పట్ల మీ నిబద్ధతతో పని చేస్తూ, రోగులకు అన్నివేళాల అందుబాటులో ఉంటూ, అనేక సేవ చేస్తున్నారని తెలిపారు. ఈరోజుల్లో ప్రజలు అనేక కారణాల వల్ల, అనేక రోగాల బారిన పడుతున్నారని వారి సేవలు చేయడానికి ఎప్పటికప్పుడు ఈ రంగంలో నిష్ణాతులైన డాక్టర్లు పుట్టుకొస్తున్నారన్న విషయం గుర్తు చేశారు. ముంజునూరి విశ్వేశ్వరరావు, డాక్టర్లు టివి.బాలకృష్ణ, టివి.వైజయంతి, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ మూర్తి, డాక్టర్ సింధు, డాక్టర్ నరసింహవర్ధన్, డాక్టర్ రమణ మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

నిరుపేద మధ్యతరగతి రోగులకు సకాలంలో వైద్యం అందించడంలో ప్రభుత్వ వైద్యుల పాత్ర చాలా కీలకమయ్యిందని లయన్స్ క్లబ్ నేత డాక్టర్ అనుసూరి నాగేశ్వరరావు అన్నారు. డాక్టర్స్ డేని పురస్కరించుకుని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి వైద్యులు కెఎస్ఎస్.శైలజ, చిన్నారావు, సౌజన్య, బాలతేజ, రఘుపతి, రమేష్, సురేష్, షబానాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎడి వి.ప్రసాద్, జెఎన్ఎస్ శ్రీనివాస్, కోట కల్యాణ చక్రవర్తి, ఆదిమూలం కనక విజయ్, కప్పల నాగభూషణం, ఊర రాజబాబు, తాళ్లూరి బాలాజీరావు ఉన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది

ప్రజాశక్తి-కోటనందూరు

రాష్ట్రంలో రాక్షస పరిపాలన సాగుతోందని టిడిపి నాయకురాలు యనమల దివ్య అన్నారు. శనివారం పాత కొట్టం, కెఎస్.కొత్తూరు గ్రామాల్లో టిడిపి నాయకుడు షేక్ నవాజ్ జానీ ఆధ్వర్యంలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను వింటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో యనమల కష్ణుడు, మోతుకూరి వెంకటేష్, గాడి రాజబాబు, అంకమరెడ్డి రమేష్, దంతులూరి చిరంజీవి రాజు, పోతల సూరిబాబు, భీమిరెడ్డి అప్పలనాయుడు, రుతల శ్రీనివాస్, బోడపాటి సత్యనారాయణ, నెమ్మది సత్యనారాయణ లెక్కల భాస్కర్, అల్లంపల్లి నరసింహమూర్తి, భీమిరెడ్డి అప్పలనాయుడు, లగుడు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు : పొన్నాడ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. శనివారం చొల్లంగిలో రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ పొన్నాడకు పలుచోట్ల ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బూరెల వెంకటరాజు, ఎంపిపి సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, కాపవరపు శ్రీదేవి, వారా సూర్య కుమారి, శివాజీ గణేష్, మాసా శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద్ కుమార్, రాయుడు గంగాధర్, టిల్లపూడి నాగేశ్వరరావు, రేపు మల్లీశ్వరి, పోతుల రత్నకుమారి, అంకాడి అంజిబాబు, కొపనాతి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, భూసారపు పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

పాణింగపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మం డలంలో పాణింగపల్లి గ్రామం లో జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపిపి పంపన నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో వీధి దీపాలు సమస్య పరిష్కారం అయిందని జగనన్న కాలనీలో అన్ని సదుపాయాలు వేగంగా కల్పించామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు ఓబులనేని వరలక్ష్మి, గ్రామ సర్పంచ్ చీకట్ల సునీత, గోపాలం, మండల ఉపాధ్యక్షులు నీతి పుడి మధుబాల వెంకట్రావు , సొసైటీ అధ్యక్షులు వైట్ల అచ్యుత రామ ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ గొడితి నాగేశ్వరరావు రావు పంచాయతీ వార్డ్ సభ్యులు, గహసారథులు సచివాలయ కన్వీనర్స్, వాలంటీర్లు, తహశీల్దార్ వైద్యనాథ్‌శర్మ, గ్రామకార్యదర్శి సీతా రామయ్య తదితరులుపాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు, లారీ ఢీ

గోపాలపురం : రెండు రోజులు గడవక ముందే చెక్‌పోస్టు సెంటర్ వద్ద ఆర్‌టిసి బస్సు, లారీ ఢీకొన్నాయి. రాజమహేంద్రవరం డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు జంగారెడ్డిగూడెం నుంచి రాజమహేంద్రవరానికి బయలు దేరింది.ఈ బస్సు గోపాలపురం చెక్‌పోస్టు వద్దకు చేరుకునే సరికి హైదరాబాదు నుంచి ఒడిశా వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు.

వైసిపి పాలనలో దళితులపై పెరిగిన దాడులు

ప్రజాశక్తి-మండపేట

రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని పలువురు అన్నారు. టిడిపి తరఫున మండపేట తహశీల్దార్ వ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. వైసిపి నాయకుల తీరుతో దళితులపై దౌర్జన్యాలు దాడులకు గురవుతున్నారు. వీటన్నింటినీ అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలం ఎస్‌సి సెల్ అధ్యక్షులు సాక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొత్తపేట

కండ్రిగ శివారు అల్లపల్లి వారి పాలెం నందు జెడ్‌పి నిధులు రూ.3 లక్షలతో సి సి రోడ్డు నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రములో ఎంపిపి మార్గాన గంగాధర్‌రావు, జెడ్‌పిటిసి సభ్యురాలు గూడ పాటి రమా దేవీ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి-మండపేట

పట్టణ పరిధిలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. శనివారం స్థానిక 22వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ టి.రామ్‌కుమార్, వైస్ ఛైర్ పర్సన్ పిల్లి గణేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ముక్కా దాలియ్య, మొండి మురళి పాల్గొన్నారు.

గోవిందరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ఆలమూరు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, పారిశ్రామిక వేత్త రెడ్డి గోవిందరావు సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కమ్మ సంఘం అధ్యక్షుడు బెజవాడ వెంకట్రావు వ్యాఖ్యానించారు. గుమ్మిలేరులో రెడ్డి గోవిందరావు సంతాప సభను శనివారం జరిగింది. సభకు రాష్ట్ర జిల్లా స్థాయి కమ్మ సంఘం నాయకులు పలువురు హాజరై గోవిందరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి కమ్మ సంఘం నాయకులు కోటేశ్వరరావు, కమ్మ సంఘం డైరెక్టర్ వంటిపిల్లి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ' విద్యాసంస్థల ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మహాత్మా గాంధీ విద్యాసంస్థలు ప్రారంభించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు కళాశాల ప్రాంగణంలో సెక్రటరీ, కరస్పాండెంట్ పిఎస్.రాజు అధ్యక్షతన ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యా ర్థులకు ఉపకారవేతనాలను అందించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-ఆలమూరు

75వ ఆజాదీ కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 216ఎ జాతీయ రహదారి ఈతకోట టోల్ మేనేజర్ కెవిఎస్ఎన్.రెడ్డి, ప్లాజా మేనేజర్ నెహెమ్యా ఆధ్వర్యంలో శనివారం చెముడు లంక ఎస్టిఎస్ఎన్ఎమ్ జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు రహదారి భద్రత పై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం చక్రవర్తి, అకౌంటెంట్ సురేష్, సేఫ్టీ మేనేజర్ రాజా, హెచ్ఒయు రవితేజ, ఐఎం.మేనేజర్ రాజా, హెచ్ఆర్ రమేష్, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆలమూరు : పారా లీగల్‌గా నియమితులైన వారికి న్యాయసేవలతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ దీపాదైవకృప అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రత్యేక శిక్షణా తరగతుల్లో ఆమె మాట్లాడారు. న్యాయసేవాధికార చట్టం 1987, నల్సా సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎపిపి ఆకుల శ్రీరాములు, బార్ అసోసియేషన్ సభ్యులు కె.నారాయణ రెడ్డి, కె.భీమశంకర రావు, అంగర సత్యనారాయణాచార్యులు, అంగర బిందు మాధవరావు, కె.సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఉండ్రాజవరం : మండలంలోని తాడిపర్రులో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు కరుటూరి వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.